https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 22 శనివారం 16-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# పోక్సో కేసులో నిందితులు శిక్ష నుంచి తప్పించుకోలేరు

## సీఎం రేవంత్‌రెడ్డి వార్నింగ్

**హైదరాబాద్, మే15**
మహిళలపైన నేరాలను తమ ప్రభుత్వం నియంత్రించిదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో 8వ తేదీ రాత్రి బాలిక తల్లి పేట్ బషీరాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. 9వ తేదీన విచారణ ప్రారంభించి కేసు పెట్టామని చెప్పుకొచ్చారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనలో మొత్తం 10 కార్యక్రమాలకు హాజరయ్యారని అన్నారు. ఆయన భద్రత కోసం 10 వేల మంది పోలీసులు పనిచేశారని చెప్పారు. 11వ తేదీన సెక్షన్లు సవరించి వెంటనే నోటీసులు జారీ చేశామని తెలిపారు. బండి భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారని ప్రస్తావించారు. ఫిర్యాదులను బేరీజు వేసుకుని అమ్మాయి స్టేట్‌మెంట్‌ను తీసుకొని నోటీసులు ఇచ్చారని తెలిపారు. తొందరపడితే 1000 మంది పోలీసులను తీసుకుని ఇంటి మీద పడ్డారని అంతా విమర్శలు చేసేవారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు ఎవరైనా తనకు మినహాయింపులు లేవని స్పష్టం చేశారు. బాలిక కేసులో ఎలాపడితే అలా చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. బండి సంజయ్‌కి తాను సహాయం చేస్తే పోక్సో కేసు పెట్టం కదా..? అని ప్రశ్నించారు. పోక్సో కేసు పెట్టామంటేనే తన కమిట్‌మెంట్ ఏమిటో తెలుస్తుంది కదా..? అని నిలదీశారు. హోంమంత్రిగానే కాకుండా ముఖ్యమంత్రిగా చర్యలు తీసుకోవడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కేసులో ఐదు టీంలు పనిచేస్తున్నాయని వివరించారు. బండి సంజయ్ ఇంటికి పోలీసులు నోటీసులు ఇవ్వడానికి వెళ్లారని.. మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది ఇంటికి వెళ్లారని తెలిపారు. బండి సంజయ్‌కి, బీఆర్ఎస్‌లకి మధ్య ఎక్కడ చెడిందో తనకు తెలియదని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇప్పుడు పోలీసు ఆఫీసర్ కాదని చెప్పారు. పోక్సో కేసు పెడితే బెదిరించినట్లా లేక బాదితురాలి పక్షాన ఉన్నట్లా అని ప్రశ్నించారు. కేటీఆర్, బండి సంజయ్‌కి మధ్య ఏముందో తనకు తెలియదని అన్నారు. చట్టప్రకారం నిందితులను శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ కేసు పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని తెలిపారు. ఏ చిన్న తప్పు చేసినా పిల్లల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. అమ్మాయికి రెండు బర్త్ సర్టిఫికెట్స్ ఉన్నాయని.. వాటన్నింటిని పోలీసులు విచారించాలి కదా..? అని ప్రశ్నించారు.

**నిందితులు తప్పించుకోలేరు..**
ఒకరోజు ఆలస్యమైన శిక్ష నుంచి నిందితులు తప్పించుకోలేరని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తనను జైల్లో పెట్టిన మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం పట్ల తాను కఠినంగా వ్యవహరించానా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ విలీనాన్ని బండి సంజయ్ వ్యతిరేకించారని కోపమా..? అని అడిగారు. తాను సత్రం నడపటం లేదని.. ప్రభుత్వాన్ని నడుపుతున్నానని చెప్పుకొచ్చారు. వందశాతం బాదితులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని.. తప్పు చేసిన వారిని శిక్షిస్తామని స్పష్టం చేశారు. డిసెంబర్‌కు ముందే జరిగిన ఘటనపైనే బాధితురాలి ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. నాలుగు నెలలు వెనక్కు వెళ్లి అప్పటి ఘటనలను విచారించాలంటే సమయం పడుతుందని చెప్పారు. కుమారుడు విషయంలో బండి సంజయ్ తీరు నైతికంగా తప్పు అని తెలిపారు. బండి భగీరథ్ ధైర్యంగా ఈకేసు ఎదుర్కొవాలని అన్నారు. కొడుకును తీసుకువచ్చి బండి సంజయ్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. నోటీసు సమయంలో స్పందించకపోతే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. వ్యవస్థలను పట్టాలెక్కించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి జిల్లా పర్యటనలకు వెళ్తున్నానని అన్నారు. నిధుల సమీకరణపైన ఎక్కువ సమయం కేటాయిస్తున్నానని తెలిపారు. జడ్పీటీసీగా ఉన్నప్పుడు ఏ ఇంట్లో ఉన్నానో ముఖ్యమంత్రి అయ్యాక కూడా అదే ఇంట్లో ఉన్నానని స్పష్టం చేశారు. కష్టపడ్డ నాయకులకే నామినేటేడ్ పోస్టులు ఇస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇంట్లో ఉండే వెడ్మ బొజ్జుకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గెలిపించుకున్నామని ప్రస్తావించారు. రూపాయి చేతిలో లేని మందుల సామెల్ లాంటి సామాన్యులకి టికెట్ ఇస్తే 50 వేల మెజార్టీతో గెలిచారని గుర్తుచేశారు. చాకలి ఐలమ్మ కుటుంబం, శ్రీకాంతాచారి కుటుంబం, కోదండరాం, ఆకనూరి మురళీ ఇలా అందరిని గుర్తుపెట్టుకుని పదవులు ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతం చేశామని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశామని అన్నారు. ఎవరు అడ్డువచ్చినా మూసీని ప్రక్షాళన చేస్తామని తేల్చిచెప్పారు. డ్రగ్స్ తీసుకుంటే కఠిన చర్యలు విధిస్తామని స్పష్టం చేశారు. ప్రధానిగా మోదీ, ముఖ్యమంత్రిగా తాను అధికారిక కార్యక్రమంలో మాట్లాడానని తెలిపారు.



కేంద్రంతో ఆనాటి సీఎం కేసీఆర్ ఏనాడు కలిసి రాలేదని అన్నారు. నిధుల కోసం తమతో కలిసి రావాలని ప్రధాని మోదీ అడిగారని ప్రస్తావించారు. ప్రభుత్వాల సహకారం గురించి మాత్రమే మాట్లాడారని చెప్పారు. రాజకీయాల్లో తన కమిట్‌మెంట్ గురించి ప్రధాని మోదీకి తెలుసునని చెప్పుకొచ్చారు. మైక్‌ల ముందే తాము మాట్లాడుకున్నామని.. రహస్యం ఏం లేదని తేల్చిచెప్పారు. కేంద్రంతో కలిసి రమ్మని తెలంగాణ ప్రభుత్వాన్ని మోదీ కోరారని ప్రస్తావించారు. తనకు డిమాండ్ ఉందని అనుకున్నా.. తనకు ఇబ్బంది లేదని చెప్పారు. దేశంలో తనకు డిమాండ్ ఉందని.. తెలంగాణ ప్రజలకు గౌరవం ఇదని తెలిపారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో తాను పనిచేస్తానని అన్నారు. సోనియాగాంధీ లేకుంటే వేయ్యేళ్లయినా తెలంగాణ వచ్చేది కాదని చెప్పారు. తాను కాంగ్రెస్‌లో చేరినప్పుడు అధికారంలో లేదని.. తన మనసుకు నచ్చినట్లు చేస్తానని తెలిపారు. అవకాశాల కోసం అవకాశవాదీగా మారనని స్పష్టం చేశారు. నిబద్ధతతో పార్టీలో చేరాననే గాంధీ కుటుంబం తనకు ఈ అవకాశం ఇచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో కీలక నిందితుడి అరెస్టు

**ఢిల్లీ, మే 15**
నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ప్రొఫెసర్ పి.వి. కులకర్ణిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అరెస్టు చేసింది. నిందితుడిని పుణెకు చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా గుర్తించిన అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తరఫున పరీక్ష ప్రక్రియలో కొన్నేళ్లుగా కులకర్ణి పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రశ్నపత్రాలను పొందే అవకాశం ఆయనకి దొరికింది. ఏప్రిల్ చివరి వారంలో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సహాయంతో పేపర్ లీక్ కుట్రకు పాల్పడినట్లు సీబీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రలోని పుణెలో తన నివాసంలో ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులను కులకర్ణి నిర్వహించినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. మనీషా సహాయంతో పలువురు విద్యార్థులను సమీకరించి వారికి రహస్యంగా కోచింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాలను లీక్ చేసినట్లు ఆరోపించారు. ఈ తరగతుల్లోనే ప్రశ్నలు, సరైన జవాబులను విద్యార్థులకు చెప్పారని అధికారులు తెలిపారు. ఆ ప్రశ్నలు మే 3న నిర్వహించిన అసలు నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రాల్లో వచ్చాయని



వెల్లడించారు. దీంతో మే 14న మనీషాను అరెస్టు చేయగా.. నేడు కులకర్ణిని అరెస్టు చేశారు. కాగా, ఈ కేసుకు సంబంధించి జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, అహల్యానగర్ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఏడుగురిని సీబీఐ అరెస్టు చేసింది. వారిలో ఐదుగురిని ఇప్పటికే కోర్టులో హాజరుపర్చగా.. ఏడు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. గురువారం అరెస్టయిన మిగిలిన ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ రిమాండ్ నిమిత్తం పుణెలోని కోర్టులో హాజరుపరిచారు. తదుపరి విచారణ కోసం ఆ ఇద్దరినీ ఢిల్లీకి తరలించనున్నారు.

# ఇంధనం పొదుపు చర్యలపై సుప్రీం కీలక నిర్ణయం..

## వారంలో రెండుసార్లు విచారణ


**న్యూఢిల్లీ,మే 15** ప్రస్తుత పెట్రోలియం సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంధన పొదుపు చర్యలపై నిర్దిష్టమైన రోజుల్లో వర్చువల్ తరహాలో కోర్టు ప్రొసీడింగ్స్ జరపనున్నట్టు ప్రకటించింది. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం ప్రకారం, ప్రతి సోమ, శుక్రవారాల్లో సుప్రీంకోర్టులో వర్చువల్ విచారణ జరుగనుంది. తక్కిన మూడు పనిదినాల్లో హైబ్రిడ్ మోడల్ (ముఖాముఖీ తరహా)లో విచారణ చేపడుతుంది. ప్రస్తుత ఇంధన సంక్షోభ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సీజేఐ సూర్యకాంత్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకూ కోర్టు ప్రొసీండింగ్స్‌ను ఫిజికల్ అప్పియరెన్స్, వర్చువల్ తరహాలో సుప్రీంకోర్టు నిర్వహిస్తోంది. ప్రధాన నరేంద్ర మోదీ ఇటీవల జాతీయ ప్రయోజనాల దృష్ట్యా వర్క్ ఫ్రమ్ హోం చర్యలు, ఇంధన పొదుపు చర్యలకు సంబంధించిన తగిన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా నిర్ణయం తీసుకుంది.

### ఫ్యాక్షన్ రాజకీయాలు తట్టుకుని

# ఇక్కడివరకొచ్చా..

### ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**అమరావతి, మే 15** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు సీఎం విజయ్‌తో పోల్చి తనను వైసీపీ నేతలు విమర్శలు చేయడంపై పవన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. దశాబ్దం కాలం పాటు నలిగిపోయి, ఫ్యాక్షన్ రాజకీయాలు తట్టుకుని ఇక్కడి వరకు వచ్చామని వ్యాఖ్యానించారు. ఈ మధ్యన పక్క రాష్ట్రంలో ఒక వ్యక్తి పార్టీ పెట్టి సీఎం అవగానే తనతో పోలిక పెట్టారని తెలిపారు. ఊర్లో పెళ్లికి




ఏదో హడావుడి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మన ఊర్లో పెళ్లి జరుగుతుంటే. చిన్నపిల్లలు పరుగులు పెడుతుంటారని.. అలా ఉంది వారి ప్రచారమని ఎద్దేవా చేశారు. ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితులు వేరని.. అక్కడి పరిస్థితులు వేరని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 2019లో తాను పోటీ చేస్తే రెండు చోట్లా ఓడించారని.. దీంతో తనతో ఉన్న నాయకులు వెళ్లిపోయారని ప్రస్తావించారు. పొంతన లేని పోలికలు పెట్టి.. ప్రచారం చేయడం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. కమ్యూనిస్టులు పార్టీ పెట్టి ఎన్నో దెబ్బలు తిని నిలబడ్డారని ప్రస్తావించారు. అదేవిధంగా ఒక రాజకీయ పార్టీ నడపడం అంటే అంత ఈజీ కాదని తెలిపారు. 2007 నుంచి 2018 వరకు దశాబ్దం పాటు తాను ఇబ్బంది పడ్డానని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. దెబ్బతినకుండా ఏదీ రాదని.. 2024కి అధికారంలో భాగస్వామ్యం అయ్యామని తెలిపారు. ఈరోజున అందరూ తనను వదిలేసినా.. తాను పార్టీని ముందుకు తీసుకెళ్తున్నానని స్పష్టం చేశారు. కార్యకర్తల నుంచి బలమైన నాయకత్వం తనకు రావాలని కోరుతున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# నీట్ విద్యార్థులది వ్యవస్థ చేసిన హత్య..

## మోదీ ప్రభుత్వంపై రాహుల్ ధ్వజం



**న్యూఢిల్లీ: మే 15**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గోవాలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారు' అని ఆందోళన వ్యక్తం చేశారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ, ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని అన్నారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. 'మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు' అంటూ మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని (్రావీ చీఖతీవఅతీఖ వీశీఅఱ) ఉద్దేశించి, 'మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలి?' అని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 'ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం' అంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

### వాళ్లు బొద్దింకల్లా వ్యవస్థపై

# దాడి చేస్తున్నారు

## సీజేఐ అసహనం

**న్యూఢిల్లీ, మే 15**
కొంతమంది నిరుద్యోగ యువతను బొద్దింకలతో సీజేఐ సూర్యకాంత్ పోల్చారు. వాళ్లు మీడియా, సామాజిక మాధ్యమం, ఆర్టీఐ కార్యకర్తల్లా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది హోదాను కోరుతున్న ఒక న్యాయవాదిని సీజేఐ మందలిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థపై దాడి చేస్తున్న పరాన్నజీవులు సమాజంలో ఉన్నారని, వారితో చేతులు కలపాలనుకుంటున్నారా అని పిటిషనర్‌ను (న్యాయవాది) నిలదీశారు. సీనియర్ అడ్వకేట్‌ల హోదాకు సంబంధించిన మార్గదర్శకాలపై జాప్యం జరుగుతున్నందున ఢిల్లీ హైకోర్టుకు అదేశాలివ్వాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. దీనిపై విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. 'సీనియర్ అడ్వకేట్ హోదా అనేది కోర్టు ప్రసాదించే విశిష్ట గౌరవం. పిటిషన్లతో వాటిని సాధించుకోలేరు' అని సీజేఐ అన్నారు. ఫేస్‌బుక్‌లో పిటిషనర్ వాడిన భాష, పోస్టులు తాము గమనిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవస్థపై దాడి చేస్తున్న కొందరు పరాన్నజీవుల తో మీరు చేతులు కలపాలనుకుంటున్నారా అని పిటిషనర్?ను సూటిగా ప్రశ్నించారు. 'సీనియర్ హోదాను మీకు తప్ప ప్రపంచంలో ఎవరికైనా ఇవ్వవచ్చు. హైకోర్టు మీకు ఆ హోదా ఇచ్చినా మీ ప్రవర్తన చూసి మేము



దానిని పక్కనపెడతాం' అని స్పష్టం చేశారు. కొందరి లా డిగ్రీల ప్రామాణికతపై కూడా తమకు అనుమానాలున్నాయని, దీనిపై సీబీఐ విచారణకు తగిన కేసు కోసం చూస్తున్నామని కూడా సీజేఐ పేర్కొన్నారు. దీనిపై ఓట్లు మాత్రమే కోరుకునే బార్ కౌన్సిల్ కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సీజేఐ వ్యాఖ్యలతో పిటిషనర్ క్షమాపణ చెప్పుకుంటూ పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరారు. అందుకు కోర్టు అనుమతించింది.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..

## బ్రిడ్జిపై నుంచి పడిన ట్రాక్టర్.. ఆరుగురి మృతి

**న్యూఢిల్లీ, మే 15**
కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మునీరాబాద్ సమీపంలో బ్రిడ్జిపై వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి కిందపడటంతో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారు ఓ కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బ్రిడ్జిపై మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాక్టర్ కిందకు పడిపోయిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి గల అసలు కారణాలపై విచారణ చేపట్టారు.

# గ్రంథాలయం ఓ జ్ఞానసంపద

**- మారెపల్లి పట్వర్థన్, ప్రిన్సిపల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల**



**మన సమాజం/చెన్నూరు:**
ఆధునికకాలంలో ఫోన్ల వినియోగన్ని తగ్గించి మంచి పుస్తకాలు చదవడం విద్యార్థులు అలవాటు చేసుకొని చదువుల్లో రాణించాలని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మారెపల్లి పట్వర్థన్ అన్నారు. శుక్రవారం రోజున కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రంధాలయ జ్ఞానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిధిగా ఆచార్య మహావాది శుభాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పట్వర్ధన్ మాట్లాడుతూ, గ్రంధాలయం అనేక పుస్తకాలు కలిగిన ఓ జ్ఞానసంపదని, కళాశాలలోని గ్రంధాలయాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యావంతులు అయిన అధ్యాపకులున్నారని, ప్రభుత్వ కళాశాలల పట్ల అపోహలు వీడి ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యను అభ్యశించాలని పట్వర్ధన్ పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల గ్రంధాలయాన్ని విద్యార్థులతో కలిసి సందర్శించి పుస్తక సమీక్ష నిర్వహించారు. ఆచార్య మహావాది శుభాష్ విరాళంగా అందించిన సుధామూర్తి జీవిత చరిత్రతో పాటు మరిన్ని ముఖ్యమైన పుస్తకాలను గ్రంథాలయంలో పొందుపరచారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ కిషోర్ కుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, డాక్టర్ డి,రామకృష్ణ, డాక్టర్ జగ్పాల్, ముకుంద్, సర్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వెంటనే రద్దు చేయాలి: ఎంసీపీఐయూ




**బెల్లంపల్లి మే 15 మన సమాజం**
పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతోందని ఎంసీపీఐయూ మంచిర్యాల జిల్లా కమిటీ ఆరోపించింది. పెంచిన ఇంధన ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు, శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు సబ్బాని రాజేంద్ర ప్రసాద్, పాసులేటి వెంకటేష్ మాట్లాడుతూ అర్ధరాత్రి నుండి లీటరుకు ?3.04 మేర పెంచిన ఇంధన ధరలు మధ్యతరగతి, పేద కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని విమర్శించారు, కొన్ని రాష్ట్రాల్లో ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుతో ఆటో డ్రైవర్లు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పుడు ఇంధన ధరల పెంపుతో వారి ఆర్థిక పరిస్థితి మరింత దెబ్బతింటుందని తెలిపారు, ఇంధన ధరలను వెంటనే తగ్గించకపోతే ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు తొగరి రాహుల్, శేఖర్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల నుండి ఆదిలాబాద్‌కు ఆర్టీసీ బస్ సర్వీసులు ప్రారంభం..

**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే,15**
ప్రయాణికుల కోరిక మేరకు జగిత్యాల నుండి సారంగాపూర్ జన్నారం మీదుగా అదిలాబాద్ వరకు రెండు ఎక్స్ప్రెస్ బస్సులను ప్రారంభించిన ఆర్టీసి, ఈ బస్ లలో ఒకటి ఉదయం 8.20 గంటలకు జగిత్యాల నుండి బయలుదేరి ఆదిలాబాద్ కు 12 :20 గంటలకు చేరుకుని తిరిగి 12: 45 కు అదిలాబాదు నుండి బయలుదేరి సాయంత్రం 4:45 నిమిషములకు జగిత్యాలకు చేరు కుంటుంది, 2వ బస్సు జగిత్యాల నుండి మధ్యాహ్నం12:00 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు అదిలాబాద్ చేరుకుని తిరుగు ప్రయాణం నాలుగున్నర గంటలకు బయలుదేరి రాత్రి 8:30 గంటలకు జగిత్యాలకు చేరుకుంటుందని జగిత్యాల డిపో మేనేజర్ కల్పన తెలిపారు.

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటే

**దేశవేణి కృష్ణ,బిఆర్ ఎస్ నాయకులు**

**మేడిపల్లి, మే 15:**
పోక్సో కేసు లో బండి భగీరద్ అరెస్ట్ ను కావాలని ఆలస్యం చేస్తున్నారని మేడిపల్లి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు దేశవేణి కృష్ణ ఆరోపించారు. అరెస్ట్ ఆలస్యం కావడం వెనుక కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయని, దీంతో బీ జే పి, కాంగ్రెస్ రెండు పార్టీ లు ఒక్కటేనని ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు . అదే బీ ఆర్ ఎస్ ప్రభుత్వం వుంటే 24 గంటల్లో పట్టుకుని అరెస్ట్ చేసేవాళ్లమని ఆయన అన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను "భూ సెటిల్మెంట్ కేంద్రం"గా మార్చేసారా..?

- నేరాలపై మౌనం.. భూములపై మెరుపు స్పందన..!
- ప్రజల భద్రత కంటే ప్లాట్ల పంచాయితీలకే మొదటి ప్రాధాన్యత..?




**మంచిర్యాల,మే 15,(మన సమాజం) :**
రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో ఓ పోలీస్ స్టేషన్ పని తీరుపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా పోలీస్ స్టేషన్ అంటే ప్రజల భద్రత, దొంగతనాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ ప్రధాన బాధ్యతలు. కానీ ఆ స్టేషన్‌లో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దొంగతనాలు జరిగినా స్పందన ఆలస్యం, గొడవలు పెరిగినా పట్టించుకోకపోవడం, ప్రజల భద్రత కంటే భూ లావాదేవీలు, సివిల్ వివాదాల పరిష్కారాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా భూముల విషయంలో స్టేషన్ చుట్టూ తిరిగే వ్యక్తులకే ప్రత్యేక మర్యాదలు, గంటల వ్యవధిలో పంచాయితీలు, రాజీలు, ఒత్తిడులు జరుగుతున్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది. "కోర్టుల్లో తేలాల్సిన వ్యవహారాలు పోలీస్ స్టేషన్‌లోనే ఎందుకు సెటిల్ అవుతున్నాయి..?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అసలు పోలీస్ శాఖ చట్టబద్ధంగా వ్యవహరిస్తుందా..? లేక కొందరి ప్రభావానికి లోనవుతుందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ సమస్యలు వచ్చినప్పుడల్లా ఆ స్టేషన్‌నే ఆశ్రయించాలన్న స్థాయికి పరిస్థితులు వెళ్లడం వెనుక ఎవరి ఆశీస్సులు ఉన్నాయో అనే చర్చ కూడా సాగుతోంది.ఇక మరోవైపు స్టేషన్ పరిధిలో పెరుగుతున్న ఇతర సమస్యలపై మాత్రం సరైన దృష్టి లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న చిన్న గొడవలు పెద్ద స్థాయికి చేరుతున్నా ముందస్తు చర్యలు లేవని, చోరీలు జరిగినా ఫిర్యాదుదారులు స్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ భూ వివాదం అయితే మాత్రం గంటల్లో స్పందన, పిలుపులు, కూర్చోబెట్టి సెటిల్మెంట్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు మరింత బలపడుతున్నాయి. "లా అండ్ ఆర్డర్ కంటే ల్యాండ్ ఆర్డర్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారా..?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదన్నది ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. కమిషనరేట్ స్థాయి అధికారులు నిజంగా పరిస్థితిని గమనిస్తున్నారా..? లేక కింది స్థాయి వ్యవహారాలను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ స్టేషన్‌లు ప్రజలకు రక్షణ కల్పించే కేంద్రాలా..? లేక భూ వ్యవహారాలకు అనధికార కార్యాలయాలా..? అన్న ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలను నివృత్తి చేయాలంటే ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి పూర్తి స్థాయి విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# బెల్లంపల్లి పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోరిక్షాలు స్వాధీనం**





**బెల్లంపల్లి, మే 15 మన సమాజం**
సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి 1 టౌన్ పోలీసులు బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తీ లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా పోలీసులు అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, కొత్తగా నివాసం ఉంటున్న వారి వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోరిక్షాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం గోప్యంగా పోలీసులకు అందించాలని సూచించారు,యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఫ్రీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యురాలుగా చాప వందన

**ఉచిత న్యాయ సహాయం చేస్తాను చాప వందన**



**కోరుట్ల టౌన్ ప్రతినిధి మే,15**
కోరుట్ల జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుకు కోరుట్ల కు చెందిన చాప వందనను ఫ్రీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నియమించినట్లు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి రత్న పద్మావతి శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు నియామకం జరిగిందన్నారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు కృషి చేస్తానని తెల్పిరు. ఈ సందర్భంగా వందనను కోరుట్ల జడ్జి కాసుల పావని, కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అంజనేయులు, శ్రీనివాస రావు, సదాశివ రాజు, చాప కిషోర్, బోయిని సత్యనారాయణ, చింతకింది ప్రేమ్, కొంపల్లి సురేష్, బద్ది నర్సయ్య, నరేందర్, ఉమ, పద్మ కళ న్యాయవాదులు అభినందించారు.

# గడ్డం శ్రీహిత ఉత్తమ మార్కులకు గాను సన్మానం

**కథలాపూర్ మండల ప్రతినిధి మే,15**
కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామానికి చెందిన గడ్డం చిన్నారెడ్డి గారి కుమార్తె గడ్డం శ్రీహిత ఇంటర్మీడియట్ 2అస ఎమ్మీటీ లో ఉత్తమ మార్కులు సాధించిన సందర్భంగా హైదరాబాదు లో నిర్వహించినటువంటి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంటర్మీడియట్ ప్రతిభా పురస్కారాలు 2025-2026 విద్య సంవత్సరానికి గాను మెరుగైన ఫలితాలు సాధించడంతో రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ వాకిటి శ్రీహరి వి హనుమంతరావు గారు, పదివేల నగదుతో పాటు మెమొంటో శాలువా సత్కారం చేసి విద్యార్థినిని అభినందించారు, ఇంటర్ ఫస్టియర్ సెకండియర్ లో ప్రతిభ కనబరిచిన మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే ఎంజూ గురుకుల పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి గురుకులాల్లో ప్రతిభ కనబరిచిన 508 విద్యార్థులకు నగదు పది వెల పురస్కారంతోపాటు మెమొంటో శాలువాతో సత్కరించిన మంత్రిపొన్నం ప్రభాకర్ వాకిటి శ్రీహరివి. హనుమంతరావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యతోపాటు విద్యార్థులకు కావలసిన బుక్స్ మరియు యూనిఫామ్స్ అలాగే ఉదయకాలం టిఫిన్స్ మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు అందించడం జరుగుతుందని, గురుకులాల్లో అయితే కాస్మోటిక్, డైట్, చార్జెస్ పెంచిన విషయం అందరికీ తెలుసని కాబట్టి విద్యార్థులే రాబోయే తరానికి మార్గదర్శకాలని అట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అలాగే మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ముందంజలోనే ఉంటుందని కాబట్టి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వారు తెలిపారు.

# పశ్చిమ బెంగాల్‌లో ‘బుల్డోజర్ మోడల్’

**అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు**

**అక్రమ కట్టడాలపై భారీ కూల్చివేత చర్యలు**

**సిలిగురిలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం**

**ప్రభుత్వ భూములు, జలవనరుల కబ్జాల తొలగింపుపై దృష్టి**



**పశ్చిమ బెంగాల్, మే 15**
పశ్చిమ బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది రోజులకే అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. ఉత్తరప్రదేశ్‌లో అమలవుతున్న ‘బుల్డోజర్ మోడల్’ తరహాలో సిలిగురి ప్రాంతంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. ఇందుకోసం భారీ స్థాయిలో బుల్డోజర్లను రంగంలోకి దింపి అక్రమ కట్టడాల తొలగింపు చర్యలు చేపడుతోంది. సిలిగురిలో ఇటీవల అక్రమ నిర్మాణాలు అధికంగా పెరిగిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభుత్వ భూములు, జలవనరులు, చెరువులు, ఇతర ప్రాంతాలపై జరిగిన కబ్జాలను గుర్తించి తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. కూల్చివేత కార్యక్రమాన్ని మరింత విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలకు సంబంధించి డార్జిలింగ్ ఎంపీ స్పందిస్తూ అక్రమ నిర్మాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఇందుకోసం రెండు డజన్ల బుల్డోజర్లను ఉత్తరప్రదేశ్ నుంచి తెప్పిస్తున్నట్లు వెల్లడించారు. అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం కఠిన వైఖరితో ముందుకెళ్తోందని తెలిపారు. ఈ అంశంపై గురువారం సిలిగురిలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, ఎస్పీతో పాటు జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. శాంతిభద్రతలు, అక్రమ నిర్మాణాల తొలగింపు, మాదక ద్రవ్యాల నియంత్రణ, అక్రమ మద్యం విక్రయాల అరికట్టడం వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. సమావేశం అనంతరం ఎంపీ రాజు బిస్తా మాట్లాడుతూ సిలిగురిలో అక్రమ నిర్మాణాలు భారీ స్థాయిలో వెలిశాయని పేర్కొన్నారు. వాటిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో స్థానిక మున్సిపాలిటీ పాలకులు, అధికారుల పనితీరుపై కూడా ఆయన విమర్శలు చేశారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, ఇతర జలవనరులపై జరిగిన కబ్జాలను పూర్తిగా తొలగించే వరకు చర్యలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. అక్రమ నిర్మాణాల నిర్మూలనతో పాటు నగర అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

# ట్రంప్ చైనా పర్యటనలో ఉద్రిక్తత..

**జర్నలిస్టుల మధ్య వాగ్వాదం**

**అమెరికా, చైనా మీడియా ప్రతినిధుల మధ్య ఘర్షణ వాతావరణం**

**అధ్యక్ష కాన్వాయ్ అనుసరణపై వివాదం**

**ఘటనపై అధికారిక ప్రకటనలు వెలువడని పరిస్థితి**



**బీజింగ్, మే 15**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటన కొనసాగుతున్న నేపథ్యంలో మీడియా ప్రతినిధుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నట్లు సమాచారం. పర్యటనను కవర్ చేసేందుకు వెళ్లిన అమెరికా జర్నలిస్టులు అధ్యక్షుడి కాన్వాయ్‌ను అనుసరించే ప్రయత్నం చేయగా చైనా అధికారులు అడ్డుకున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ కాన్వాయ్ వెనుక అమెరికా మీడియా ప్రతినిధులు ప్రయాణించేందుకు సిద్ధమైన సమయంలో చైనా భద్రతా సిబ్బంది జోక్యం చేసుకున్నట్లు సమాచారం. కాన్వాయ్ పూర్తిగా వెళ్లిన తర్వాత మాత్రమే వెళ్లాలని వారు సూచించినట్లు చెబుతున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలో చైనా, అమెరికా జర్నలిస్టుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. తమ దేశ భద్రతా నియమాలు, ప్రోటోకాల్ ప్రకారమే ఆదేశాలను అమలు చేస్తున్నామని చైనా వర్గాలు స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే అధ్యక్షుడి మీడియా బృందం కాన్వాయ్‌తో పాటు ప్రయాణించే హక్కు తమకు ఉందని అమెరికా జర్నలిస్టులు వాదించినట్లు తెలుస్తోంది.ఒక చైనా మీడియా ప్రతినిధి మాట్లాడుతూ ఇది తమ దేశం అని, భద్రతా సిబ్బంది అనుమతులు లేకుండా ముందుకు వెళ్లడం సాధ్యం కాదని చెప్పినట్లు సమాచారం. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని కొద్దిసేపు తోపులాటకు దారితీసినట్లు ప్రచారం సాగుతోంది. అమెరికా జర్నలిస్టులను వేరే గదిలో ఉంచినట్లు, ఓ రహస్య భద్రతా విభాగం అధికారిని అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. అయితే ఈ అంశాలపై ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ వెలువడలేదు. జర్నలిస్టులు గాయపడ్డారా, ఎవరినైనా అదుపులోకి తీసుకున్నారా అనే అంశాలపై అమెరికా అధ్యక్ష భవనం గానీ, చైనా అధికారులు గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

# వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత నీట్ యూజీ పరీక్షలు

**పరీక్షల పారదర్శకతకు కేంద్రం కీలక నిర్ణయం**

**జూన్ 21న నీట్ రీ పరీక్ష నిర్వహణ**

**అక్రమాలపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగింపు**



**న్యూఢిల్లీ, మే 15**
వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ యూజీ పరీక్షల విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం కీలక ప్రకటన చేస్తూ వచ్చే ఏడాది నుంచి నీట్ యూజీ పరీక్షను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షల పారదర్శకత పెంచడం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ధర్మేంద్ర ప్రధాన్, నీట్ రీ పరీక్షలకు సంబంధించిన ప్రవేశ పత్రాలు జూన్ 14వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసిన నేపథ్యంలో జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షకు సంబంధించిన ఓ అంచనా ప్రశ్నాపత్రం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం, అందులోని అనేక ప్రశ్నలు పరీక్షలో పునరావృతమయ్యాయన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తమవడంతో రీ పరీక్ష నిర్వహణకు నిర్ణయించినట్లు తెలిపారు. పరీక్షలలో అక్రమాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని, అయినా విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ తరహా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో లోపాలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సమగ్ర నివేదిక అందించనుందని చెప్పారు. మే 3న జరిగిన పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ సమగ్ర దర్యాప్తు జరపనున్నట్లు వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి కొనసాగించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# కలకలం రేపిన ఏసీబీ తనిఖీలు

**జడ్చర్ల, మే 15 :**మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలో శుక్ర వారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మద్యాహ్నం ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ నేతృత్వంలో సిబ్బందితో కలిసి తని ఖీలు నిర్వహించారు. ఈ సంఘటనతో జడ్చ ర్ల మునిసిపాలిటీ పరిధిలో కలకలం రేగింది. ఏసీబీ అధికారుల తనిఖీలలో ఎవరైనా అధి కారి పట్టుబడ్డాడా? అన్న అంశం సర్వత్రా చ ర్చ జరిగింది. పలు అంశాలపై మునిసిపల్ క మిషనర్ లక్ష్మారెడ్డి, వివిధ విభాగాల సిబ్బంది తో ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆకస్మిక తనిఖీల గురించి విలేకరులకు వివరించారు. వివిధ రకాల ఫిర్యాదుల మేరకు జడ్చర్ల ము నిసిపాలిటీలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వ హించడం జరిగిందని తెలి పారు. వచ్చిన ఫిర్యాదు ల మేరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకుం టామని తెలిపారు. జడ్చర్ల మునిసిపాలిటీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారన్న సమాచారం అందుకున్న జోసెఫ్ అనే వ్యక్తి మునిసిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్‌పై ఫిర్యాదు చేశాడు. జడ్చర్ల పట్టణంలోని నాలా కన్వర్షన్ విషయంలో అన్ని రిపోర్టులు మునిసిపల్ కమిషనర్‌కు అందచేశానని, ఓ మాజీ కౌన్సిలర్ ద్వారా రూ.50వేల నగదు ఇవ్వడం జరిగిందంటూ ఫిర్యాదు చేశాడు.

# ‘ఉపాధి’ సంక్షోభానికి సూచిక

బస్టాండ్ దగ్గర పనికోసం ఎదురుచూస్తున్న మహిళలు, గుట్టలపై జరిగే పనికోసం కిలోమీటర్ల కొద్దీ నడిచే కూలీలు... పనికోసం తండ్లాట... దొరకకపోతే నిరాశ...! లోయపల్లిలోని ఈ జీవన దృశ్యాలు గ్రామీణ భారతంలో విస్తరిస్తున్న ఉపాధి సంక్షోభానికి సూచికలు. పని దినాలు తగ్గిపోవడం, హాజరు-వేతన వ్యవస్థల్లో గందరగోళం, చెల్లింపుల ఆలస్యం కలిసి గ్రామీణ ‘ఉపాధి’ని అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని లోయపల్లి ఆ మండలంలో అత్యధిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) జాబ్ కార్డులు ఉన్న రెండో పెద్ద గ్రామం. 2021-22లో ఇక్కడ ప్రతి కుటుంబానికి సగటున 50.3 పనిదినాలు లభించాయి. ఈ సంఖ్య క్రమంగా తగ్గుతూ 2025--26లో 20.52కి పడిపోయింది. వందరోజులు పని పూర్తిచేసిన కుటుంబాలు కేవలం మూడు మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న గ్రామీణ ఉపాధి సంక్షోభానికి లోయపల్లి ఒక చిన్న సూచిక మాత్రమే.లోయపల్లిలో 2000 పైచిలుకు కార్డులున్నాయి గానీ 200 మందే పనులు చేస్తున్నారు. మండలాధికారులు కుంటలు తవ్వించమన్నారు అని చెప్పారు సర్పంచ్ రఘురామ్. కానీ సేద్యపు కుంటలు తవ్వడమూ గుట్ట లెక్కడమూ చాలా కష్టమని ఇక్కడి మహిళా కార్మికులు చెబుతున్నారు. మాజీ వార్డు మెంబరు ఈరమల్లు వెంకటయ్య మాటల్లో చెప్పాలంటే, “గుట్టలు దూరం. గట్టిగుంటయి. తవ్వితే మట్టి ఎల్లదు. అందుకే ఎవ్వరూ సరిగా పోతలేరు”. దీనిపై ఎంపీడీవో బాలశంకర్ స్పందిస్తూ, లోయపల్లిలో చదునైన భూమి తక్కువగా ఉందని, గుట్టల ప్రాంతాల్లో చదునైన భూమిని గుర్తించి పనులు చేపట్టే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. గుట్టలపై పనిచేయడం కోసం రానూ పోనూ రోజుకు ఎనిమిది కిలోమీటర్లు నడవాల్సిందేనని బొట్టు నీరజ తెలిపింది. “కింద పని లేదంటే గుట్ట లెక్కినం. ఇప్పుడు నాలుగు గుంపులు పోతున్నయి” అని తెలిపాడు మోరా సాయిలు. గత ఆరేళ్ళలో సగటున ఏడాదికి 67 పనిదినాలు వాడుకున్న సాయిలు కుటుంబం, 2025లో వారం రోజులే పనిచేసింది. ఈ నేపథ్యంలో నేను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న నరేగా మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్)లో పని డిమాండ్ సరళిని పరిశీలించాను. 60 జాబ్ కార్డుదారుల దరఖాస్తులు, వారికి కేటాయించిన పని, సంబంధిత మస్టర్లు, పనిరోజులు, చెల్లింపుల వివరాలను గమనించాను. 2025 ఏప్రిల్‌లో 87 డిమాండ్లు నమోదయ్యాయి. పనికోసం ఎవరూ దరఖాస్తు చేసినట్టు ఆధారాలు కనిపించలేదు. మే నెలలో 334 డిమాండ్లు నమోదయ్యాయి. తొలి వారంలో ఒక్క దరఖాస్తు కూడా లేదు. 13వ తేదీ తర్వాతే పనులు మొదలయ్యాయి. డిమాండును ఆలస్యంగా నమోదు చేసి, తర్వాత పని కల్పించినట్టు చూపించారా వంటి సందేహాలు తలెత్తుతున్నాయి. ఒక మహిళకు మే 26 నుంచి వారం రోజుల పని లభించింది. నాలుగు రోజులు పని చేశాక, ఆమెతో పాటు గుంపులోని వారందరికీ రెండు రోజులు ఆబ్సెంట్ పడింది. కొన్ని మస్టర్లలో ఒకే రోజు గుంపులోని కూలీలందరికీ గైర్హాజరు నమోదైంది. ఇది యాప్ ఆధారిత హాజరు వ్యవస్థ ప్రభావమా? అసలేమైంది? దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ కోసం అనేకసార్లు ప్రయత్నించినప్పటికీ స్పందన లేదు. ఎక్కువ మంది కార్మికులు జనవరి-మార్చి మధ్యలోనే తమ పనిదినాలు వాడుకున్నారు. ఆకారం యాదమ్మ-భిక్షపతి కుటుంబం గత ఆర్థిక సంవత్సరంలో 16 రోజులు మాత్రమే పనిచేసింది. అది కూడా ఫిబ్రవరిలోనే. అంతకుముందు నాలుగేళ్ళలో ఈ కుటుంబం తొలి త్రైమాసికంలోనే సగటున 45 పనిదినాలు వాడుకుంది. “డిమాండ్ పెట్టుకుంటే ఒక వారం పని ఉంటది. తర్వాత వారం ఉండదు. డిమాండ్ యాక్సెప్ట్ చేయట్లేదు. అందుకే పనిదినాలు తగ్గుతున్నాయి” అని మేట్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు గంపెల్లి రాజు తెలిపారు. 2022-25 మధ్య సగటున ఏడాదికి 63 రోజుల చొప్పున పనిచేసిన రాజు కుటుంబం, గత ఆర్థిక సంవత్సరంలో 28 పనిదినాలకే పరిమితమయ్యింది. రోజువారీ వేతనం రూ.307కి పెరిగినప్పటికీ, ఆదాయం రూ.8,561ను మించలేదు. ఫోటో క్యాప్చర్ కావడం లేదని, హాజరు నమోదు కావడం లేదని చెప్పడంతో ఫిబ్రవరి మొదటి వారం తర్వాత తన తల్లి లక్ష్మమ్మ పనికి వెళ్లడం మానేసిందని రాజు తెలిపారు. అప్పటికే కేటాయించిన మరో 12 రోజుల పనిని కూడా ఆమె వదులుకోవాల్సి వచ్చింది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) వైఫల్యాల కారణంగా ఆమెకు శిక్ష పడినట్టయింది.హాజరు నమోదు ప్రక్రియలో పదేపదే సమస్యలు తలెత్తుతున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిపిన క్షేత్రస్థాయి పరిశోధనలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగానూ ఇలాంటి ఇబ్బందులు కొనసాగుతున్నట్టు స్థానిక మీడియా వార్తలు తెలియజేస్తున్నాయి. ఈకేవైసీ పూర్తి చేసిన తర్వాత కూడా కార్మికుల హాజరు నమోదు ప్రక్రియ సవ్యంగా సాగడం లేదు. హక్కుగా లభించాల్సిన ఉపాధిని సాంకేతిక పర్యవేక్షణ పేరుతో క్రమంగా కుదించే, కూలీలకు అందకుండా చేసే ధోరణి కనిపిస్తోంది.ఉపాధి కూలీల్లో ఎవరిని అడిగినా ప్రధానంగా వినిపించేది వేతనాల సమస్యనే. “డబ్బులొస్తలేవు.. కిరాయిలెట్ల ఎల్తయి” అని ప్రశ్నించాడు సాయిలు. అతడు మే చివరి వారం చేసిన పనికి అక్టోబరు రెండున వేతనం జమ అయింది. జనవరి చివరి వారంలో చేసిన పనికి ఇంకా కూలి రాలేదు. ఎంఐఎస్ డేటా ప్రకారం ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ల ప్రాసెసింగ్‌లో తెలంగాణలో జాప్యమవుతోంది. ఈ పరిస్థితి వేతన చెల్లింపులు ఆలస్యం కావడానికి దారితీస్తోంది. 15 రోజుల గడువు దాటినా కూలి అందకపోతే, 16వ రోజు నుంచి బకాయిలపై రోజుకు 0.05 శాతం పరిహారం ఇవ్వాలని చట్టం చెబుతోంది. అయితే, కాగ్ నివేదిక ప్రకారం ఈ పరిహారం అమలులో తీవ్ర లోపాలున్నాయి. 2019--24 మధ్య 4,19,479 జాప్య దినాలకు పరిహారం చెల్లించాల్సి ఉన్నప్పటికీ కేవలం 8 శాతానికి మాత్రమే ఆమోదం లభించింది. 22 శాతం తిరస్కరించబడ్డాయి. 70 శాతం పెండింగ్‌లో ఉన్నాయి.కనీసం 20 రోజులు ఉపాధి పనిచేసిన వాళ్లకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింది రెండు విడతలుగా రూ.12,000 ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కానీ పనే ఇవ్వనపుడు పథకం ఎలా వర్తిస్తుందనే ప్రశ్నలు వినవస్తున్నాయి. “ఉపాధి పనిదినాలతో నిమిత్తం లేకుండా భూమి లేని వ్యవసాయ కార్మికులందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలని 2025 మొదటి గ్రామసభలో లొల్లి పెట్టినం. నీరుకోసం, నీడకోసం కూడా పోరాటం చేసినం” అని గత రెండేళ్లలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలను వెంకటయ్య వివరించారు.పని దొరకక, దొరికిన పని నిలవక, కూలి సమయానికి అందక-- ఉపాధి హామీ పథకం మీద నమ్మకం దెబ్బతింటున్న సంకేతాలు లోయపల్లిలో కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి కేవలం అమలు సమస్య కాదు, దాని వెనుక ఉన్న విధాన మార్పులపై వేరుగా పరిశీలన జరగాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని లభ్యత తగ్గిపోతూ, హాజరు-వేతన వ్యవస్థలు సమస్యల్లో చిక్కుకుంటున్న నేపథ్యంలో లోయపల్లి అనుభవం వ్యవస్థాత్మక వైఫల్యాన్ని బయటపెడుతోంది.

MANA SAMAJAM
మన సమాజం
తెలుగు డిజిటల్ దినపత్రిక
శనివారం, మే 16, 2026



# హీరోలకే అంత ప్రాధాన్యత ఎందుకు

## ఇండియన్ సినిమాపై ఆలియా భట్ కామెంట్స్ వైరల్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ తాజాగా అంతర్జాతీయ వేదికైన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న పురుషాధిక్యత (ఘీశ్రీవ ఇశీఎఱఖఅఎవ) గురించి ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. కాన్స్ వేదికపై మాట్లాడిన ఆలియా భట్.. భారతీయ సినిమాల్లో చాలా కథలు ఇప్పటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. దాదాపు 75 శాతం సినిమాల్లో కథ కంటే హీరోకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. “సినిమాలో హీరో ఉన్నాడా లేదా అనే దానికంటే, కథ బలంగా ఉందా అనే విషయానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి” అంటూ ఆమె అభిప్రాయపడ్డారు. ఆలియా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు ఆమె ధైర్యంగా నిజం మాట్లాడిందని ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా హాలీవుడ్‌ను పొగిడే క్రమంలో భారతీయ సినిమాను తక్కువ చేసి మాట్లాడారంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. అలాగే, ఆమె వ్యక్తిగత జీవితాన్ని కూడా ఈ వివాదంలోకి లాగుతున్నారు. ఆమె భర్త రణబీర్ కపూర్ నటించిన యానిమల్ వంటి సినిమాలు తీవ్ర పురుషాధిక్యతతో నిండిపోయి ఉన్నాయని, అలాంటి చిత్రాలపై ఆలియా ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు. ఇండస్ట్రీలో మార్పు కావాలని చెబుతున్నవారు ముందుగా తమ ఇంటి నుంచే ప్రారంభించాలి అంటూ కొందరు కౌంటర్లు ఇస్తున్నారు. అయితే మరోవైపు, ఆలియా చెప్పిన విషయాల్లో వాస్తవం ఉందని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. హీరోల పారితోషికాలు, ప్రాధాన్యత, ప్రమోషన్లు అన్నీ కూడా ఇప్పటికీ హీరోలకే అనుకూలంగా ఉంటున్నాయని, హీరోయిన్లకు సరైన గుర్తింపు దక్కడం లేదని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా కృతి సనన్, కంగనా రనౌత్, తాప్సీ వంటి నటీమణులు ఇండస్ట్రీలో ఉన్న వివక్షపై బహిరంగంగా మాట్లాడారు. హీరోలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ, హీరోయిన్లను ద్వితీయ స్థానంలో ఉంచుతున్నారంటూ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడీ నేపథ్యంలో మరోసారి ఇండియన్ సినిమాలో మార్పు ఎప్పుడు వస్తుంది? కథలే అసలు హీరోలుగా నిలిచే రోజులు ఎప్పుడు వస్తాయి? అనే ప్రశ్న సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ‘పెద్ది’ ప్రమోషన్లకు జాన్వీ దూరం




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ లెజెండరీ నటి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలోకి అడుగుపెట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఇప్పటివరకు భారీ కమర్షియల్ విజయాన్ని మాత్రం అందుకోలేకపోయింది. బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించిన జాన్వీ, ఇప్పుడు తన ఫోకస్‌ను తెలుగు సినిమాలపై ఎక్కువగా కేంద్రీకరిస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పెద్ది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ గ్రామీణ యువతిగా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్‌లలో ఆమె లుక్‌కు మంచి స్పందన లభించింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఓ ప్రముఖ దినపత్రిక ప్రచురించిన కథనం ప్రకారం, జాన్వీ కపూర్ ‘పెద్ది’ ప్రమోషన్లకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకుందనే ప్రచారం జరుగుతోంది. భారీ రెమ్యూనరేషన్ కారణంగానే ఆమె ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించిందని, సినిమాలో తన పాత్రకు అంత ప్రాధాన్యత లేదనే భావనతో ప్రమోషన్లలో పాల్గొనాలనే ఆసక్తి చూపడం లేదని ఆ కథనం పేర్కొంది. అయితే ఈ వార్తలపై చిత్ర యూనిట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ ప్రచారం నిజమైతే, అది జాన్వీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే ‘పెద్ది’ వంటి భారీ పాన్ ఇండియా చిత్రంతో ఆమెకు దక్షిణాదిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా మరింత గుర్తింపు దక్కే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల్లో బలమైన మార్కెట్‌ను సంపాదించుకోవడానికి ఈ సినిమా కీలకంగా మారనుంది. ప్రస్తుతం జాన్వీ చేతిలో పెద్దగా హై-ప్రొఫైల్ ప్రాజెక్టులు లేని నేపథ్యంలో, ‘పెద్ది’ విజయం ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలను తెచ్చిపెట్టే అవకాశముంది. అందుకే ఈ సినిమా ప్రమోషన్లలో చురుకుగా పాల్గొనడం ఆమె కెరీర్‌కు ప్లస్ అవుతుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా రిలీజ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ హైప్ మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జాన్వీ చివరకు ప్రమోషన్లలో పాల్గొంటుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

# ‘జైలర్ 2’ షూటింగ్‌లో విషాదం..

## కరెంట్ షాక్‌తో యువకుడు మృతి!



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన జైలర్ చిత్రం 2023లో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళు సాధించి రికార్డులు క్రియేట్ చేసింది. మొదటి భాగం ఘన విజయం సాధించడంతో ఇప్పుడు జైలర్ 2ను మరింత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సీక్వెల్‌లో రజినీకాంత్‌తో పాటు ఎస్‌జే సూర్య, విద్యా బాలన్, మిథున్ చక్రవర్తి వంటి ప్రముఖులు నటిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది.వీశీజఱవం అయితే తాజాగా ‘జైలర్ 2’ షూటింగ్ స్పాట్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్‌లోని పనయూర్ ఆదిత్యరామ్ ఫిల్మ్ సిటీలో ప్యాచ్‌వర్క్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇంటి సెట్‌లో ఫ్యాన్లు బిగించే పనిలో ఉన్న సమయంలో అనూహ్యంగా కరెంట్ షాక్ తగలడంతో సేలం జిల్లాకు చెందిన కార్తికేయన్ (28) అనే యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో షూటింగ్ స్పాట్‌లో ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న కానత్తూర్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో కరెంట్ లీకేజీ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. షూటింగ్ ప్రదేశంలో తగిన భద్రతా చర్యలు తీసుకున్నారా లేదా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ‘జైలర్ 2’ చిత్రీకరణ చెన్నై, గోవా, కేరళ ప్రాంతాల్లో పూర్తయినట్లు తెలుస్తోంది. కొన్ని అదనపు సన్నివేశాల కోసం గత రెండు వారాలుగా ఈ ఫిల్మ్ సిటీలో పనులు కొనసాగుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం కలచివేస్తోంది. ఇటీవలి కాలంలో తమిళ సినీ పరిశ్రమలో షూటింగ్ సమయంలో ప్రమాదాలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో దర్శకుడు పా రంజిత్ తెరకెక్కించిన వెట్టువం షూటింగ్‌లో స్టంట్ మాస్టర్ మోహన్‌రాజ్ మరణించగా, కార్తీ నటిస్తున్న సర్దార్ 2 షూటింగ్‌లో కూడా ఓ స్టంట్ ఆర్టిస్ట్ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో షూటింగ్ స్పాట్‌లలో కార్మికులు, టెక్నీషియన్స్ [illegible]దతపై మరింత కఠిన[illegible]ంధనలు అమలు చేయాలని సినీ వర్గాలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# శర్వానంద్ జోడీగా?

ఇటీవల విడుదలైన ‘కపుల్ ఫ్రెండ్లీ’ చిత్రంలో చక్కటి అభినయంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది మాజీ మిస్ ఇండియా మానస వారణాసి. ఈ సినిమా విజయంతో ఈ భామకు తెలుగులో భారీ ఆఫర్లొస్తున్నట్లు వినికిడి. తాజా సమాచారం ప్రకారం శర్వానంద్‌తో కలిసి ఆమె ఓ చిత్రంలో నటించబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. శర్వానంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో ‘జార్జ్ క్రిష్’ పేరుతో ఓ రొమాంటిక్ కామెడీ చిత్రం తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని కంఫర్మ్ చేసినట్లు తెలిసింది.వీశీజఱవంఈ సినిమాలోని కథానాయిక పాత్ర కోసం అనంతిక సనీల్‌కుమార్, రుక్మిణి వసంత్, మమితాబైజు పేర్లు మొన్నటివరకూ వినిపించాయి. చిత్రబృందం చివరకు మానస వారణాసి వైపే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది.

